# మినీ కథలు:

## రికమెండేషన్



ఎం. జానకీరామ్

ఎండాకాలపు ఎండల్లా ఆ రోజు కూడా ఆ వూళ్ళో ఎండ జోరుగా కాస్తున్నది.

అయినా పిండిమర సుబ్బయ్య పట్టుదల సడలకుండా కొడుకు రంగనాథాన్ని వెంట బెట్టుకొని కోటపాలెం వెడుతున్నాడు - తన కవసరమైన పని అతి ముఖ్యమైనది. కొడుక్కి వుద్యోగం సంపాదించే ప్రయత్నంలో మహానంది నాయుడుగారిని కలుసుకోవడానికి వెడుతున్నాడు.

ప్రొద్దున్నే పొరుగింటి ప్లీడరు గుమాస్తా నారాయణ పుణ్యమా అని అడ్వొకేటు కామేశ్వరరావుగారి నుంచి కోటపాలెం నాయుడుగారికి బలమైన రికమెండేషన్ లెటరు దొరికింది. ఆ నాయుడుగారు పేరు మోసిన కాంట్రాక్టరు. హైద్రాబాదు వరకూ మాంచి పలుకుబడి వున్నవాడు ఆయన కామేశ్వరరావుగారి క్లయంటు. గనక తన కుమారునికి ఇన్సూరెన్సు ఆఫీసులో అసిస్టెంటు పోస్టుకి వచ్చిన ఇంటర్వ్యూ యీ రికమండేషన్ లెటరు ద్వారా సార్థకమవుతుంది. అని సుబ్బయ్య ప్రగాఢ విశ్వాసం. ఎట్లాగయినా ఆ పోస్టింగు రంగనాథానికి వేయించుకోవాలనే పట్టుదల ఎర్రటి ఎండలో సుబ్బయ్యను రెండు మైళ్ళు నడిపిస్తున్నది. అక్కడికి రోడ్డు గతుకులతో నిండి. మధ్యలో కల్వర్టు శాశ్వత రిపేరులో నున్నందున రిక్షా వాళ్ళెవళ్ళూ ఈ మధ్యన పాలెం రామంటున్నారు. కామేశ్వరరావుగారింటినుంచి ఉదయం పదిన్నరకి బయలుదేరిన సుబ్బయ్య అవసరాన్ని మించిడబ్బులేనందున పాలెంకు నడకనే సాగిస్తున్నాడు.

బి. యే. పార్టు బై పార్టు గత అక్టోబరులో కంప్లీటు చేసిన రంగనాథం సుబ్బయ్య పెద్దకొడుకు. వానికేదో ఓ విధంగా వుద్యోగం దొరికించుకొంటే తన బరువు తగ్గుతుందని సుబ్బయ్య తాపత్రయమంతాను కొడుకు ఇంటర్లో చేరినప్పుడే. తనే స్వయంగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజికి పిలుచుకుపోయి పేరు నమోదు చేయించాడు. సీనియారిటీ వుండబట్టి యిప్పటికి యీ ఇంటర్వ్యూ వచ్చింది. అదీ ఎల్లైసీ డివిజనాఫీసులో. ఆ ఆఫీసు ఆవూరిలో క్రొత్తగా తెరిచారు. ఈ వచ్చిన అవకాశాన్ని సద్విని గం చేసుకోవాలని సుబ్బయ్య తాపత్రయపడిపోతున్నాడు.


పదకొండున్నరకి నాయుడుగారిలు చేరుకున్నారిద్దరూ. ఆయన ఇంట్లో లేరు. పొలం మీదకిపోయి వున్నందున భోజనానికి రాగలరని రూఢి పర్చుకొని, అక్కడే పడిగాపున్నారు. ఆయనొచ్చేసరికి ఒంటిగంటన్నరయింది. సుబ్బయ్య యెదురేగి నమస్కార బాణంతోసహా కామేశ్వర్రావుగారి లెటరందించాడాయనకి. రెండంటిసీ స్వీకరించి వాళ్ళని వరండాలో కూచోబెట్టి, స్నాన భోజనాదులు ముగించుకొనివచ్చి వాళ్ళ యెదుటే లెటరు చదివి రంగనాథం వైపు చూసి "అబ్బాయి యీతడేనా" అన్నాడు. రంగనాథం "మ రే నండి" అంటూ వినయం ప్రదర్శించాడు.

నాయుడుగారు రెండు నిమిషాలు ఆలోచనా సముద్రంలో మునిగి తర్వాత "మన టవున్‌లోకి క్రొత్తగా వచ్చిన గవర్నమెంటు డాక్టరు విఠలరావుగారు లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషను డాక్టరు కూడా. ఆయన హైద్రాబాదునుంచే వచ్చారు. ఆయనకి ఇన్సూరెన్సు హెడ్డాఫీసులో చాలామంది తెలుసు. ఆయనకి లెటరిస్తే మీపని జరిగిపోతుంది" అన్జెప్పి వాళ్ళబ్బాయిని కేకేసి లెటర్ ప్యాడూ, కలమూ తెప్పించాడు. తన లాయరు వ్రాసిన వాక్యాలనే తానూ వ్రాస్తూ సుబ్బయ్యనూ, రంగనాథంనూ తన స్వంతమనుషుల్లా భావించి పని సానుకూలం చెయ్యాలని మరీ వ్రాశాడు. దాన్ని కవర్లోపెట్టి విలాసంగా డాక్టరుగారి విలాసం వ్రాసి, అతికించి, భరోసాతో కూడుకొన్న చిరునవ్వుతోబాటు ఆ కవర్నందించాడు.

సుబ్బయ్య మనసులో ఆశ చిగురించింది. ఈ ఉద్యోగమవుతే తమరి మేలు మరువలేమని మరీ మరీ చెప్పుకొని సెలవు పుచ్చుకొని తిరుగుముఖం పట్టారు.

ఎండ నిప్పులు చెరగుతున్నట్టున్నా వాళ్ళ అవసరం దాన్ని ఖాతరు చెయ్యలేదు. టవున్‌కి మళ్ళీ వచ్చేసరికి మూడున్నరయింది. ఇంటికెళ్తే ఆలస్య మవుతుందని దోవలో అయ్యరు హోటల్లో టిఫిన్ ముగించుకొని డాక్టరు గారింటికొచ్చేశారు.

డాక్టర్ విఠలరావు భోజనానంతరం విశ్రాంతి ముగింపు ఘట్టంలో వున్నారు. నాలుగింటికి నిద్రలేచి సాయంకృత్యాలు



ముగింపుకొని. డ్రెస్ చేసుకొని. టెన్నిస్ రాకెట్ చేతబట్టుకొని కాంపౌండులోని కొచ్చాడు స్కూటర్ స్టార్ట్ చెయ్యటాని.

సుబ్బయ్యా. రంగనాథం గేటు తోసుకొని లోపలికికొచ్చి ఆయన కెదురై నమస్కరించారు. ఆయన ఏమిటన్నట్టు చూడగా సుబ్బయ్య నాయుడుగారిచ్చిన లెటరందించాడు అక్కడికక్కడే దాన్ని చదివిన డాక్టరు వాళ్ళని లోపలికి తీసికెళ్ళి డ్రాయింగ్‌రూంలో కూచోబెట్టి "ఈ కుర్రాడికేనా ఉద్యోగం" అని పరామర్శించి, క్వాలిఫికేషన్లూ వగైరా కూపీలాగి మళ్ళీ సుబ్బయ్యతో "చూడండి సుబ్బయ్యగారూ ఎల్లైసీ హెడ్డాఫీసులో నాకెవరూ డైరెక్టుగా తెలీదు. అయినా మా నాయుడుగారు మిత్రుల్ని నాకప్పగించారు. గనుక మీకు తప్పకుండా పనయ్యేట్టు చూస్తాను. మనూళ్ళో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటుగా వచ్చారే వెంకట్రావుగారు. ఆయనకి లెటరిస్తా పట్టుకెళ్ళండి. ఆయనకి కొందరు డైరెక్టర్లుకూడా తెలుసు. మీకు తప్పకుండా పని జరుగుతుందని తన లెటర్ హెడ్‌నుంచి ఓ కాగితంలాగి గ్రీనింక్ పెన్నుతో అందంగా ముత్యాల్లాంటి అక్షరాల్తో మేజిస్ట్రేటు వెంకట్రావు గారికి లెటర్ ముగించి కవర్లో వుంచి చక్కగా అతికించి అందించాడు.

సుబ్బయ్య మనస్సులో ఆశాలత మొగ్గ తొడిగింది. డాక్టరుగారికి నమస్కరించి బయటికొచ్చారు. మేజిస్ట్రేటుగారయిదింటి వరకూ కోర్టులో వుంటారుగనక వాళ్ళిద్దరూ యింటికొచ్చేశారు. కాస్త మజ్జిగన్నం తిని తెరపిన వడ్డారు.

కాసేపింట్లో కూర్చుని అయిదున్నరకి మేజిస్ట్రేటు గారింటి కెళ్ళారు. అప్పటికి టైం అయిదున్నరయింది. మేజిస్ట్రేటుగారి బంగళా వరండాలో బంట్రోతున్నాడు. కొడుకుతో బాటు సుబ్బయ్య లోనికెళ్ళి అయ్యగారితో మాట్లాడాలని బంట్రోతుకు చెప్పాడు.

దేన్ని గురించి మాట్లాడాలో తెలుసుకున్నమీదట బంట్రోతు వాళ్ళ ప్రక్కనే వున్న బెంచీమీద కూర్చోమన్నాడు. అయ్యగారికోసం కాచుక్కూచున్నారిద్దరూ.

కాలం గడుస్తూ వున్నది. ఆరు ముప్పావయింది. దీపాలు వెలగడం కూడా అయింది. అప్పటికి వెంకట్రావుగారు స్నానమూ, సాయంకాల పూజా ముగించుకొని, తెమిలి బయట కొచ్చారు. అయ్యగారొస్తున్నారనే బంట్రోతు సైగతో యిద్దరూ లేచి నిలబడ్డారు. ఆయన్ని చూసి నమస్కరించారు.

"ఎవరూ? ఏం కావాలి?" అనే ప్రశ్నాద్వయాన్ని వినిపించారాయన సుబ్బయ్య సమాధానంగా డాక్టరిచ్చిన కవరందించాడు. ఆయన దాన్నందుకొని పూర్తిగా చదువుకొని ఈజీ ఛేర్‌లో కూచుని వాళ్ళనీ బెంచీ మీద కూచోమన్నాడు.

మళ్ళీ సుబ్బయ్య వైపు చూసి వెంకట్రావుగారు "రేపీ యింటర్వ్యూకి హైద్రాబాదు వాళ్ళెవరూ రావటం లేదుట. సెలక్షన్ కమిటీలో ఎవరెవరున్నారో యింకా తెలీలేదు. ఎవరున్నా ఫర్వాలే గనుకోండి. మీ పనయ్యేలా చూస్తాను" అని బంట్రోతుతో కాగితమూ, కలమూ తెప్పించి అన్ని వివరాల్తోటి లెటరు ముగించి సుబ్బయ్యకిస్తూ. "మనూళ్ళో అడ్వొకేటు కామేశ్వర్రావుగారికి మంచి పలుకుబడి వుంది. ఆయనెట్లాగైనా ఆ కమిటీ మెంబర్లని పట్టెయ్యగలడు. మీ పని నా స్వంత పనిగా ఆయనకి అప్పజెపుతూ వ్రాశాను.


ఇలా అంటూ వుండగా సుబ్బయ్య ముఖంలో రంగులు మాసిపోసాగాయి. అతని మనసులో ఆశ వెలిసిపోయింది. మేజిస్ట్రేటుగారి చేతినుంచి రికమండేషన్ లెటర్లు నాలుగు తన చేతిలో పడేటప్పటికి డాక్టరింటివద్ద మొగ్గదొడిగిన సుబ్బయ్య మనసులోని ఆశాలత పుష్పించకుండానే ఆ వరండాలోనే వాడిపోయింది. రంగనాథం అయోమయంగా చూస్తున్నాడు. మేజిస్ట్రేటుగారి వద్ద ఎట్టకేలకు సెలవు పుచ్చుకొని యిద్దరూ బయటపడ్డారు.

దాంతో సుబ్బయ్య "ఒరే రంగా రేపట్నుంచీ నువ్వూ పిండిమరకి వచ్చేసెయ్" అంటూ కవర్ని నాలుగు ముక్కలు చేసి రికమండేషన్ని గాలికి వదిలాడు.

## గాథావళి:

# రాజనీతి

భరతుడు చేసిన పనికి మాండవికి చాలా కోపంవచ్చింది. రాముని పాదుకలు సింహాసనంమీద పెట్టి భరతుడు వాటిని పూజిస్తున్నాడు. అంతేగాక స్వయంగా సన్యాసి జీవితాన్ని గడుపుతున్నాడు. ఇక ఆమె సహించలేకపోయింది. ఓ రోజున తన మనసులోని మాట భరతునితో చెప్పింది-"ఏమిటీ ఘోరం! మీరేమో సన్యాసి అయిపోవడమేగాక, రాముని పాదుకలు సింహాసనంమీద అలంకరించారు! తన సుఖాల్ని, భోగభాగ్యాల్ని ఎవరైనా ఇలా త్యాగం చేస్తారా చెప్పండి? మీరు నిజంగా మూర్ఖులు కాకపోతే మరేవిటి!"



నెమ్మదిగా మాట్లాడమని మాండవికి సౌంజ్ఞచేస్తూ భరతుడిలా అన్నాడు- "ఓసీ పిచ్చిదానా! నెమ్మదిగా మాట్లాడు. గోడకు చెవులుంటాయి! మూర్ఖుణ్ణి నేను కాదు, నువ్వే మూర్ఖురాలవు. నా ప్లానింగు ఏమిటో నీకర్థం కావడం లేదు. ఇది కుటిల రాజనీతి. ప్రస్తుతం రాముని దే రాజ్యం. ఆయన మాటకే విలువుంది. మన పార్టీ అతన్ని పధ్నాలుగు సంవత్సరాలపాటు పార్టీ సభ్యత్వంనుంచి బహిష్కరించింది. ప్రత్యక్షంగా రాముడు "పవర్"లో లేడు. అయినా అతని బలం ఎక్కువగానేవుంది. ఈనాటికీ మెజారిటీ ఆయనదే. రామునికి వ్యతిరేకంగా యిప్పుడు నేను నడిస్తే నాకు "అపోజిషన్" ఎక్కువయిపోతుంది. అందుచేత అతని పాదుకల్ని పూజిస్తున్నాను. నేటి రాజనీతి యిదే చెపుతుంది. పిచ్చిదానా నీ కెందుకు చింత చెప్పు? ఇంకా పధ్నాలుగు సంవత్సరాలు టైముంది. ఇప్పుడు నేను 'పబ్లిక్ సపోర్టు' సంపాదించే ప్రయత్నంలో వున్నాను."

మాండవి మంత్ర ముగ్ధురాల్లా భరతుణ్ణి చూస్తూ ఉండిపోయింది.

మూలం సుబోధ్‌కుమార్ శ్రీవాస్తవ

అనువాదం : కాలిపు శర్మావతారం